క్లుప్తంగా

డాక్టర్ పాల్‌రాజ్‌కు ఘనంగా నివాళి



కాలేజీలోని పాల్‌రాజ్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కాలేజీ యాజమాన్యం

ఎటపాక: మాజీ ఎమ్మెల్యే,డాక్టర్ పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపకుడు డాక్టర్ సతీష్ పాల్‌రాజ్‌కు కళాశాల సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. 12వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఎటపాకలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వరలక్ష్మి,కార్యదర్శి జకరయ్య, కోశాధికారి విక్టోరియా,కరస్పాండెంట్ రాజశేఖర్,ప్రిన్సిపాల్ రాజేష్,హాథిరాం,సందీప్ తదితరులు నివాళులర్పించారు.

వాహనం ఢీకొని ఆవు, దూడ మృతి



మృతిచెందిన మూగజీవాలు

రాజవొమ్మంగి: మండలంలోని వట్టిగెడ్డ గ్రామం వద్ద మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ చూలు ఆవు, దూడ మృతిచెందాయి. ఆవు,దూడ చనిపోవడంతో ఆ గ్రామానికి చెందిన రైతులు పల్లి సత్యనారాయణ, కేలిల సత్యనారాయణలకు దాదాపు రూ.లక్ష నష్టం జరిగినట్టు గ్రామస్తులు తెలిపారు.

ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాలపై అవగాహన

అడ్డతీగల: పర్యావరణహిత జీవనశైలి(మిషన్ లైఫ్) కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను గ్రామాల్లో విరివిగా చేపడుతున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర చెప్పారు. వచ్చేనెల 5 వరకూ నిర్విరామంగా ప్రజలతో నేరుగా కలిసి వివిధ కార్యక్రమాలను చేపట్టనున్నట్టు తెలిపారు.

పేటలో భారీ అన్నసమారాధన

దేవీపట్నం: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఇందుకూరుపేటలో మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. బస్టాండు సమీపంలో పల్లపు వీధిలో గల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు మూడు వేల మంది భక్తులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న గంగాధరప్రసాద్

చింతూరు: మండలంలోని బొడ్రాయిగూడెంలో జరిగిన అగ్నిప్రమాదంలో బాధితులకు సేవా భారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు వితరణగా అందజేశారు. ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు సాయంగా దుప్పట్లను పంపిణీ చేసినట్టు సంస్థ కో ఆర్డినేటర్ డాక్టర్ గంగాధర ప్రసాద్ తెలిపారు.

విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థి

డుంబ్రిగుడ: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి శెట్టి సునీత తెలిపారు.

అర్చకులకు పూజా సామగ్రి పంపిణీ

కొయ్యూరు: కినపర్తి పంచాయతీ చుట్టుబందలో 108 మంది గిరిజన అర్చకులకు మంగళవారం పూజా సామగ్రిని అందజేశారు.పెదమాకవరం మోదకొండమ్మ ఆలయ నిర్వాహకులు డి.వి.డి. ప్రసాద్ చేతుల మీదుగా వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ దుచ్చరి చిట్టిబాబు పాల్గొన్నారు.

ఏడాది పొడవునా స్వచ్ఛమైన తాగునీరు

ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్‌తో సాధ్యం చేసిన అధికారులు

కూనవరం: మండలంలో 15 గిరిజన గ్రామాలకు ఏడాది పొడవునా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేసిన కృషి ఫలించింది. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయానికి దిగువన గోదావరి నదిలో కొత్తగా రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్ (ఇసుకలో బావి)తో మండలంలో టేకులబోరు, జగ్గవరం, జగ్గవరం కాలనీ(కోతులగుట్ట), భీమవరం, భీమవరం మినీ ట్యాంకు పరిధి, మర్రిగూడెం, పైదిగూడెం, పంద్రాజుపల్లి, వెంకన్నగూడెం, శ్రీరామపురం, బండారుగూడెం, తాళ్లగొమ్ము, బొడ్రాయిగూడెం, రాయిగూడెం, రేగులపాడు ప్రాంతాలకు వరదల సమయంలో కూడా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అవుతుంది. గతంలో సుమారు రూ. కోటిన్నర వ్యయంతో నిర్మించిన ఫ్లోరైడ్ రహిత రక్షిత తాగునీటి పథకం నిరుపయోగం అయ్యింది. అనంతరం అనేక విజ్ఞప్తుల మేరకు 2013లో గోదావరి నది నుంచి సబ్‌మెర్సిబుల్ మోటార్ల ద్వారా నీటిని సేకరించి శుద్ధి చేసి, సరఫరా చేస్తున్నారు. వర్షాలు, వరదల సమయంలో మైక్రోఫిల్టర్ ద్వారా కేవలం 25 శాతం మాత్రమే తాగునీరు పరిశుభ్రం అవుతుంది. ఈ విషయం గమనించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గోదావరిలో కొత్తగా మరో ఇన్‌ఫిల్ట్రేషన్ బావి నిర్మించారు. కొత్తగా నిర్మించిన ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్‌లో స్వచ్ఛమైన తాగునీరు పుష్కలంగా నిల్వ ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. దాన్ని కూడా మైక్రో ఫిల్టర్ ద్వారా మరో సారి శుభ్రపరిచి, అక్కడి నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకులోకి పంపిస్తామని చెప్పారు. కాగా స్వచ్ఛమైన తాగునీటిని మేజరు గ్రామపంచాయతీ అయినా కూనవరంలో కూడా సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కూనవరం కొత్తగా నిర్మించిన ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్



కోతులగుట్ట వద్ద 2013లో నిర్మించిన మైక్రో ఫిల్టర్ సంపు

కూనవరం ప్రజలకు తాగునీరు అందించాలి



మండల కేంద్రం కూనవరంలో కొత్తగా నిర్మించిన ఇన్‌ఫిల్ట్రేషన్ వెల్ ద్వారా కూనవరం గ్రామస్తులకు రక్షిత నీటిని అందజేయాలి. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకోవాలి.

– కొమ్మాని అనంతలక్ష్మి, ఎంపీటీసీ

పూర్తిస్థాయిలో సరఫరాకు కృషి

స్వచ్ఛమైన తాగునీటిని పూర్తిస్థాయిలో అందించేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న నిధుల మేరకు పనులు పూర్తి చేశాం. కొత్తగా నిధులు మంజూరైతే పైపులైన్ల ఏర్పాటుపై దృష్టి పెడతాం.కూనవరం గ్రామానికి కూడా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రయత్నిస్తాం.

– భాను ప్రకాష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

సంక్షేమ పాలనలో ప్రతి గడపలోనూ సంతోషం

గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: ముఖ్యమంత్రి, సంక్షేమ సారథి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడపగడపలో సంతోషం వెల్లివిరుస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలో గడుతూరు గ్రామ సచివాలయ పరిధిలో మగతపాలెం, గెంజిగెడ్డ, బర్సింగి పెదపార్లు, వెదురుపల్లి గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించి, సీఎం వై.ఎస్.జగన్ పాలనకు మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు. ఆయా గ్రామాల్లో 259 గడపలను ఆమె సందర్శించి ప్రభుత్వ పాలన, నాలుగేళ్లలో అందించిన సంక్షేమ పథకాలపై ఆమె ప్రజల అభిప్రాయం తెలుసుకున్నారు. స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించారు. ఎమ్మెల్యే స్వయంగా తమ గ్రామాలకు వచ్చి ప్రజల సమస్యలను తెలుసుకోవడం చరిత్రలో చూడలేదని స్థానికులు చెబుతుండడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా ప్రతినిధులే స్వయంగా ఇళ్లకు వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కారాని కృషి చేయడం గొప్ప విషయమన్నారు. భారత దేశ చరిత్రలోనే ప్రజల చేత ఎన్నుకున్న ఎమ్మెల్యేలు స్వయంగా గడపగడపకు తిరిగి సమస్యలు పరిష్కరించడమనేది ఇదే ప్రథమమని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, సీదరి కొండబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయుడు,ఎంపీటీసీ చిన్నారావు, మండల సచివాలయ కన్వీనర్ కళ్యాణం, మాజీ సర్పంచ్ రాజం దొర, వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరరావు,చంద్రపతి, మత్స్యకొండబాబు, వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు, గృహసారథులు దేవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మగతపాలెంలో లబ్ధిదారునికి బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సీఎం జగన్‌కే గిరిజనుల మద్దతు

– అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అనంతగిరి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజనులు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవడమే తమ బాధ్యత అని గిరిజన మహిళలు, వృద్ధులతో పాటుగా సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారులు చెబుతున్నారని ఆయన తెలిపారు. మండలంలోని మారుమూల వేంగడ పంచాయతీ మెట్టపాడు, చీడివలస, బంజోడ, సుకురుపుట్టు, వేంగడ గ్రామాల్లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఐదు గ్రామాల్లో 483 గడపల వద్దకు వెళ్లిన అరకు ఎమ్మెల్యే పాల్గుణ ఆయా గ్రామస్తులకు సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాల మంజూరుపై ఆరా తీశారు. అనంతరం ఆయా గ్రామస్తుల యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. గత ప్రభుత్వానికి భిన్నంగా పాలన సాగిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందని చెప్పారు. పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకపోతే సమస్యను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలను అందించాలని ఆదేశించారు. సర్పంచ్ సోడిపల్లి సీమ, ఎంపీటీసీ తమ్మన్న, మాజీ ఎంపీటీసీ గంగన్న, సోషల్ మీడియా కన్వీనర్ పాంగి సతీష్, ఎంపీడీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పాఠశాలలు తెరిచే నాటికి జనన ధ్రువీకరణ పత్రాలు

పాడేరు డీఎల్‌పీవో పి.ఎస్.కుమార్

కొయ్యూరు: పాఠశాలలు తెరిచే నాటికి 12వేల మందికి జనన ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని పాడేరు డీఎల్‌పీవో పి.ఎస్.కుమర్ అన్నారు. వారికి సర్టిఫికెట్లు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఆయన మంగళవారం కొయ్యూరు ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనన ధ్రువీకరణ పత్రాలను జారీ చేయడంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు.పౌరసేవలను వేగంగా అందించాలన్నారు. మాతా శిశు మరణాలను నివారించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగునీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఎంపీడీవో,ఈవోపీఆర్‌డీ తరచూ గ్రామ సచివాలయాలను సందర్శించి, విధులకు గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో ఎక్కువ మందికి పని కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నాయుడు పాల్గొన్నారు.



కార్యదర్శులతో సమీక్షిస్తున్న డీఎల్‌పీవో కుమార్

సకాలంలో జనన ధ్రువీకరణ పత్రాల జారీ

గూడెంకొత్తవీధి: సచివాలయాల ద్వారా ఐదేళ్లలోపు చిన్నారులకు జనన ధ్రువీకరణ పత్రాలను సకాలంలో జారీ చేయాలని, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న వాటిని జూన్‌నెలాఖరులోగా పూర్తిచేయాలని స్థానిక తహసీల్దారు రాజ్‌కుమార్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జనన ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సచివాలయ ఉద్యోగులపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సులో హెచ్చరించారని చెప్పారు. గూడెంకొత్తవీధి మండలంలో ఐదేళ్లలోపు పిల్లలు సుమారు 1,990 మంది ఉన్నారన్నారు. వారి డేటాను తహసీల్దారు కార్యాలయం ద్వారా అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సబ్‌కలెక్టర్ ద్వారా ఇవి జారీ అవుతాయన్నారు. జననీ సురక్ష యోజన పథకంపై ఏఎన్‌ఎంలకు అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతాలు సరిచేయాలని సూచించారు.



మాట్లాడుతున్న గూడెంకొత్తవీధి తహసీల్దారు రాజ్‌కుమార్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

వలంటీర్ల వల్లే లబ్ధిదారులకు శతశాతం న్యాయం

గొలుగొండ: వలంటీర్లు, గ్రామ సచివాలయం వ్యవస్థ వల్ల అర్హులందరికీ సంక్షేమ పథకాలు శతశాతం అందిస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా రావణాపల్లి గ్రామ సచివాలయంలో ఉత్తమ వలంటీర్లను ఆయన ఘనంగా సత్కరించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేగా పెట్ల ఉమాశంకర్ గణేష్ గెలిచి మంగళవారంతో నాలుగు సంవత్సరాలు పూర్తి కావడంతో కేక్ చేసి చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలు 25,442 ఓట్ల మెజార్టీతో గెలిపించారని, వారికి రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు లోచల సుజాత, చోద్యం సహకార బ్యాంక్ చైర్మన్ పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణ, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వలంటీర్లకు సత్కారం చేస్తున్న దృశ్యం

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

రావికమతం: స్థానిక హైస్కూల్ ఆవరణలో ఉత్తరాంధ్ర స్థాయి మెగా వేసవి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రావికమతం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల నుంచి 62 జట్లు పాల్గొన్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. సోమవారం 8, మంగళవారం 7 జట్లకు పోటీలు నిర్వహించారు.


విశ్వశాంతి కోసం పాదయాత్ర



కన్నంపేటలో నిర్వహించిన పాదయాత్రలో పాల్గొన్న రామానంద స్వామి

జి.మాడుగుల: విశ్వశాంతి, లోక కల్యాణార్థం పాలకలపాటి గురుదేవుల ఆశ్రమం రామానంద స్వామి ఆధ్వర్యంలో మంగళవారం గొలుగొండ మండలం కృష్ణదేవిపేట, కొయ్యూరు మండలం కన్నంపేట తదితర గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. సనాతన ధర్మాన్ని కాపాడడానికి ఈ పాదయాత్ర చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రావు మాస్టర్, నాగేశ్వర రావు మాస్టర్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బోదండ కూర సేకరణ



బోదండకూర ఆకులను సేకరిస్తున్న చిన్నారులు

అనంతగిరి: గిరిజన ప్రాంతంలోని అడవుల్లో దొరికే బొందడకూరకు మంచి డిమాండ్ ఉంది. గిరిజనులు ఎక్కువగా ఇష్టపడి తినేవాటిలో బోదండ కూర ఒక్కటి. ఇటీవల కురిసిన వర్షాలతో బొదండకూర చెట్లకు ఆకులు చిగురించాయి. అనంతగిరి– అరకు ప్రధాన రహదారి ఆనుకుని ఇరువైపులా బోదండకూర చెట్లు ఎక్కువగా ఉండడంతో కూరను సేకరించే పనిలో గిరిజన మహిళలు, చిన్నారులు నిమగ్నమయ్యారు. వీటిని సేకరించి, కూర తయారుచేసి తింటారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో అడవుల్లో బోదండ కూర అధికంగా లభిస్తోంది.

సమాచారం లేకుండా నీలగిరి వృక్షాల నరికివేత

పెదబయలు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భారీ నీలగిరి వృక్షాలను పక్కనే ఉన్న గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల–1 హెచ్‌ఎం టెండర్ల వేసి నరికించారని జెడ్పీ ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు బొండా సన్నిబాబు ఆరోపించారు. 1970 ముందే సుమారు పాఠశాల నిర్మాణం చేశారని, అప్పట్లో పాఠశాల ఆవరణలో నీలగిరిచెట్ల నాటారని చెప్పారు. ఇటీవల జెడ్పీ పాఠశాలకు అనుకుని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–1 ఏర్పాటు చేశారని తెలిపారు. జెడ్పీ పాఠశాలకు చెందిన 10 చెట్లను ఎలాంటి సమాచారం లేకుండా నరికించడం దారుణమని, సంబంధిత హెచ్‌ఎంపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈవిషయంపై కలెక్టర్,ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.



నరికిన నీలగిరి చెట్లు

దివ్యాంగులకు సేవ అభినందనీయం

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతపల్లిరూరల్: దివ్యాంగులకు సేవ చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. విశాఖపట్నానికి చెందిన ది ఎబిలిటీ పీపుల్ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం దివ్యాంగుల గుర్తింపు శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించాలని సూచించారు. శిబిరం నిర్వాహకులను ఆమె అభినందించారు. వెన్నుపూస గాయపడిన వారికి,ఎముకల సమస్యలు ఉన్న వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 150 మంది బాధితులు శిబిరానికి హాజరయ్యారు. అవసరమైన వారికి 15 రోజుల్లో కృత్రిమ అవయవాలు అందిజేస్తామని ఆ సంస్థ ప్రతినిధులు రజిని, సరోజిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లాలం సీతయ్య, ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య,సర్పంచ్ దురియా పుష్పలత, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి, ఎంపీటీసీలు పద్మ,జయలక్ష్మి,పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్,పూర్ణచంద్రరావు,రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

క్రీడాకారులకు ప్రోత్సాహం

గంగవరం : క్రీడాకారులకు పోలీసుశాఖ తరఫున తగిన ప్రోత్సాహం అందిస్తామని స్థానిక ఎస్‌ఐ చినబాబు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కలుముల కామరాజు మెమోరియల్ క్రికెట్ టోర్నీ రెండవ సెమీస్‌లో ఓజుబంద్– రంపచోడవరం టీమ్‌లు తలపడగా ఆ మ్యాచ్‌ను ఎస్‌ఐ చినబాబు మంగళవారం తిలకించారు. రంపచోడవరం టీమ్ విజయం సాధించగా, ఆ టీమ్‌లో మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ సాధించిన క్రీడాకారుడు పెద్దను అభినందించి మెడల్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల నిర్వహణకు సాయం అందజేస్తామని చెప్పారు. ఈ టోర్నీలో మొత్తం 52టీములు పాల్గొనగా రంపచోడవరం, పాముగండి టీములు ఫైనల్‌కు చేరుకున్నాయని టోర్నీ నిర్వాహకులు వివరించారు. యువసేన, ఓల్డ్ టైగర్స్ యువకులు స్వామి, శివ, అనిల్‌కుమార్, గోవింద్, సుధీర్, రాంబాబు,అనంత్, అమీర్, చక్రీ, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్‌ఐ చినబాబు

1460 పశువులకు ఆంత్రాక్స్ నిరోధక టీకాలు



ఆవులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఏడీ గణేశ్వరావు

అరకులోయ రూరల్: గన్నెల పంచాయతీలోని తడక,పాలంగూడ, కందులుగుడికాగువలస, పెదవలస,తోటవలస గ్రామాల్లో 1,460 పశువులకు ఆంత్రాక్స్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ గణేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులు,మేకలు,గొర్రెలు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. పశువులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డాక్టర్ గణేశ్వరరావు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని, నాణ్యమైన మాంసాన్ని మాత్రమే భుజించాలని గన్నెల పీహెచ్‌సీ వైద్యాధికారి కమల, పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ గణేశ్వరరావు తెలిపారు.తడాక గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి చేసిన నీటిని తాగాలని సూచించారు. అనారోగ్యలక్షణాలుంటే వైద్యాధికారులను వెంటనే సంప్రదించాలని చెప్పారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలిపారు.పశుసంవర్ధక శాఖ వైద్యధికారి శీనయ్య, వెటర్నరీ అధికారి సాంబశివరావు పాల్గొన్నారు.

అమ్మవారి ఘటం సంచారం

అడ్డతీగల: స్థానిక ప్రజల ఇలవేల్పు సోమాలమ్మ అమ్మవారి ఘటం డప్పు వాయిద్యాల నడుమ మంగళవారం అడ్డతీగల గ్రామంలో సంచారం చేసింది. బాలిక నెత్తిన ఘటం ఉంచి సాక్షాత్తు అమ్మవారు రూపంలోని ఇలా గ్రామ సంచారం చేసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దర్శనం ఇవ్వడం ఆనవాయితీ. ఇలా అమ్మవారి రూపంలోని నెత్తిన ఘటం ధరించిన బాలికకు ప్రజలు భక్తిశ్రద్ధలతో పసుపు,కుంకుమ సమర్పించి బియ్యాన్ని అందిస్తారు.వీటిని తీసుకెళ్లి అల్లూరి సీతారామరాజు కాలనీలోని అమ్మవారి ఘటం ఉంచిన చోట ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యంగా సమర్పిస్తారు.ఇలా గ్రామ సంచారం చేస్తూ పవనగిరి క్షేత్రంలోని గంగాలమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య క్షేత్రం తరఫున చీర,సారె,పసుపు, కుంకుమలను అందించారు.



పవనగిరి క్షేత్రం వద్ద గంగాలమ్మ ఘటంతో బాలిక

పెదమట్టపల్లి–కుందులూరు రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి

వీఆర్‌పురం: అటవీశాఖ అభ్యంతరాలతో ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన పెదమట్టపల్లి –కుందులూరు రహదారి నిర్మాణాన్ని పూర్తిచేయాలని మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు పట్టుబట్టారు.స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ కారం లక్ష్మి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని పెదమట్టపల్లి–కుందులూరు రహదారి నిర్మాణ పనులు ప్రారంభమై నెలలు గడుస్తున్నా ముందుకు సాగడం లేదని, అటవీశాఖ అభ్యంతరాలతో నిలిచిపోయాయని సభ్యులు చెప్పారు. ఆ సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. మండలంలోని పోలవరం ప్రాజెక్ట్ ముంపు ప్రభావిత గ్రామాల్లో స్ట్రక్చర్ వ్యాల్యూ సర్వే పారదర్శకంగా జరుగుతోందని తహసీల్దార్ ఎస్.శ్రీధర్ తెలిపారు.అనంతరం సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల పురోగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం.రత్నకుమారి, ఎంఈవో వి.వి.లక్ష్మీనారాయణ,వెలుగు ఏపీఎం కిషోర్, జెడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, వైస్ ఎంపీపీ ముత్యాల గంగాభవాని, ఎంపీటీసీ సభ్యులు బంధం విజయలక్ష్మి, పూనెం ప్రదీప్, సర్పంచ్‌లు పిట్టా రామారావు, పూనెం సరోజినీ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్

పాడేరు పట్టణంలో ఆక్రమణల తొలగింపు రేపు

పాడేరు రూరల్: స్థానిక ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న ఆక్రమణలను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు ఈ నెల 25 తేదీ ఉదయం 9 గంటలనుంచి తొలగించనున్నట్టు తహసీల్దార్ వి.త్రినాథనాయుడు సోమవారం ఓ ప్రకటన తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్ అంబేద్కర్ జంక్షన్ నుంచి సినిమాహాల్ సెంటర్ మీదుగా సెరీకల్చర్ కార్యాలయం వరకు పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బి రహదారి రెవెన్యూ శాఖ స్థలాల్లో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ చేపడతామన్నారు.